కథానిక

పిలగాని ఏడుపు



అల్లం వీరయ్య

బస్సు కంకర రోడ్డు మీద ముక్కుతూ మూల్గుతూ పోతున్నది. ఆ బస్సులో మాగిన చెమట కంపు వాసన, పికపికలాడుతూ ఉన్న జనం మాటలు నరహరి లోపల చెప్పరాని మల్సు తిరుగుతున్నాయి. ఆ మత్తులో పూర్తిగా మునిగిపోయి కనుచూపు మేర దాకా వ్యాపించిన కోసిన పొలాలను కిటికీలో నుండి చూస్తుంటే - అతనికి మరచిపోయిన జీవితం యావత్తూ పోటెత్తుతోంది.

తూర్పు దిక్కు వేలాడుతున్న మబ్బు తునకలు - వరి కొయ్య కాళ్ళ మీద మెరుస్తున్న ఎండపొడ - పొలాల్లో వరి కుప్పలు - కుప్పల దగ్గర లీలగా మెదలుతున్న మనుషులు... అతనికి దుఃఖాన్ని కలిగించాయి.

నవంబరు మాసంలో కూడ కాలువ నీళ్లకు డిబడిబలాడుతున్న చెరువు కట్టను బస్సు చుట్టేస్తున్నది. చెరువు తుంగలో నీలం రంగు కలువ పూల మొగ్గలు - హాయిగా జలకాలాడే బర్రెలు, కట్ట మీద కేకలేస్తూ తిరిగే బరిబాత పిల్లలు - ఒక్కొక్కటి కదిలిపోయి ఒక్క కుదుపుతో బస్సు వేప చెట్టు స్టేజీ దగ్గర ఆగింది.

సూట్‌కేసు చేతిలో పట్టుకొని కండక్టరు యివ్వవలసిన చిల్లర మరచిపోయి నరహరి బస్సు దిగాడు.

నరహరి ఆ ఊరికి రాక దాదాపు రెండేళ్ల వుతున్నది. నరహరి స్వంత ఊరు అదే. కాని స్వంత ఊర్లో నరహరి ఉండలేని పరిస్థితుల్లో వేటకుక్కలు, అదీ మనిషి మాంసం రుచి మరిగిన వేట కుక్కలు తరుమగా భార్య పిల్లలతో వెళ్ళిపోయాడు. నరహరి చదువుకున్న వాడు కనుక ఎన్ని ఇబ్బందులు పడ్డా, అతను ఉద్యోగం సంపాదించుకోగలిగాడు. కాని అనేక కారణాల రీత్యా అతను తన గతపు నీలి నీడలు మరిచి ఊరికి రాలేకపోయాడు. నరహరికి గుప్పున వెనుకటి సంగతులేవో మనసులో లేచాయి. వాటన్నిటిని దూరం గొట్టినా అతని చేతులు - ఒకప్పుడు నాగలి దున్ని కాయగాచిన చేతులు మాత్రం చూసుకోకుండా ఉండలేకపోయాడు.

ఈ గొడవలు తరిమేసి రెండడుగులు వేశాడో లేదో "నమస్తే బావా గిప్పుడేనా రాకడ. అక్క పిల్లలు అంత బాగున్నరా?" హోటల్ గుడిసెలో నుండి ఎర్రటి యువకుడు...

"ఓ మొండయ్యా! ఆ.. గిప్పుడే రాకడ. అంత మంచిగనే ఉన్నరు." నరహరికి మాటలు సరిగ్గా రాలేదు.

ఆ హోటల్ గుడిసెలో లుంగీలు కట్టుకొని ఇంకా అయిదారుగురు యువకులున్నారు. "మొగిలి, చక్రపాణి, రాజం, లక్ష్మయ్య, అరే అందరు పెద్దవాళ్ళయిపోయారు" అనుకున్నాడు నరహరి.

వాళ్ళందరి కళ్ళల్లో ఒకే భావం. వేట కుక్కలు తరుముతున్న బెదురు. వాళ్ళు ఇవ్వాల్లో రేపో దేశం మీద పడేలాగున్నారు!

"ఎవలదీ?" ఎముకలు తప్ప గోరెడు మాంసం లేని ఒక ఆకారం.

నరహరి పరిశీలనగా చూశాడు. "అరె! వడ్ల రాజీరు బావన్నట్టున్నది" అనుకునే సరికే రాజీరు నరహరిని గుర్తుపట్టి 'ఓయ్ నరహరి అంగదుని వేషం కడ్తావా? హన్మంతునిదా? కోలాటం కొప్పు ఏద్దామా?' అన్నాడు కిసకిస నవ్వుతూ.

రాజీరు ఆ వూర్లో మేటి కళాకారుడు. ఎండాకాలం వెన్నెల రాత్రుల్లో అతని కాలు నిలిచేది కాదు.

నువ్వు గల్లనే ఉన్నవ్ గని - నా పనే అయిపోయింది బావా! ఓపాలి నిరుడు ఎండ కాలంల 'మామల్లు' తీసుకోపోయి మోకాళ్ళ సీలెలన్ని ఊడగొట్టిండ్లు. ఇగ ఇయ్యేడేమొ అడ్ల పని సాగక వరి మొయ్యబోతే ఇక అన్ని లకలుకలైపోయినయి.' అన్నాడు హాస్యంగా. వడ్ల రాజీరు భయంకరమైన దరిద్రంలో బతికాడు. మోటు పనికి తాగుడు తోడైంది. కాని అతనెన్నడు ఏడ్వలేదు.

'రాకరాకచ్చినవ్ ఒక పొల్లం (సారా ప్యాకెట్టు) కొడుతవా?' అన్నాడు రాజీరు.

నరహరికి పోయిన నవ్వు వచ్చింది.

ఈ మాటలు జరుగుతుండగానే వేప చెట్టు మొదట్లో కూర్చున్న ఒక పొట్టి నల్లటతను లేవలేక లేచి వచ్చి - నుదురుకు చెయ్యడ్డం బెట్టుకొని 'ఓ నరహరి అల్లుడా! బాగున్నవా? మా లింగవ్వ గిన అత్తందా?' అన్నాడు.

నరహరి అతని కళ్లను పోల్చుకున్నాడు.

అతను దొమ్మటి నర్సయ్య... బొత్త పెరిగింది. శరీరం ఉబ్బిపోయి వజవజలాడుతున్నది. కండ్లు వచ్చిన బుడ్డపరుక చేపల్లాగా ఉన్నాయి.

'ఊరు దూరమయ్యింది. అడివి దగ్గరయ్యింది. మనూర్లెకు కాలువలచ్చినయ్. కాలవల నీల్లతోనే కలిగిన మారాజులచ్చిరి. నేను మాత్రం గుంటెడు పొలం కండ్ల సూడకపోతి. పోనీ కొడుకులా అంటె లేకపాయిరి. ఉన్న ఒక్క బిడ్డ కానరాని రాజ్జెంల' నర్సయ్య మాట పూర్తికాకముందే -

'నెల నుంచి నువ్వు రోజు వచ్చె పోయె బస్సు సూడవడ్తివి. లింగక్క రాకపాయె.' హోటల్లోనుండి చక్రపాణి.

'కన్న కదుపురా అయ్య' నర్సయ్య ఇంకా నరహరి ముఖంలోకే చూస్తున్నాడు.

నరహరికి లింగమ్మ ఇప్పుడు ఎక్కడుంటున్నదో తెలియదు. ఆ మాట గాని, కన్పించ లేదని చెప్పడానికి గాని మనస్కరించలేదు.

నరహరి ముందుకు కదిలాడు. వంద గజాలు నడిస్తే ఎప్పుడు పారే వాగు. వాగొడ్డుకు ఊదుగు చెట్టు చుట్టేసిన మేడి చెట్టు తెల్లని కొమ్మలకు ఎర్రగా గుత్తులు గుత్తులుగా కాసిన మేడి పండ్లు - పిల్లలుగా ఉన్నప్పుడైతే ఎర్రబడిన ఒక్క మేడి పండు ఉండేది కాదు. ఒకమారు మేడి చెట్టు మీద నుండి కింద ఊదుగు పొదలో పడిపోయి ఒళ్లంతా ముల్లు దిగిన బాధ అనుభవంలోకి వచ్చింది.

వాగులో నీళ్ళు జుల జుల పారుతున్నాయి. ముదురు పచ్చ తుంగ బాగా పెరిగి ఉన్నది. కొంచెం అటేటు నడిచాడో లేదో పొడుగ్గా పెరిగిన రెండు వీరు మద్ది చెట్లు కన్పించాయి.

నరహరి బిల బిల వాగు నీళ్ళను తన్నుతుంటే అతని మనసులోని బరువంతా కడిగేసినట్లనిపించింది. వంగి కొన్ని నీళ్ళు మొహం మీద పోసుకున్నాడు. నీళ్ళల్లో చేప పిల్లలు కాళ్ళను గోముగా కరుస్తున్నాయి.

కొంచెం దూరం వాగులో నడిచేసరికి 'నీల్ల చెలిమె' కాడ పది మంది స్త్రీలు వివిధ రకాల వయసుల వాళ్లున్నారు.

నరహరిని చూసి అందరి మొహాలు వెలిగిపోయాయి.

పొట్టిగా నల్లగా వున్నామె "ఏవలు- నరహరే వున్నట్టున్నది. నల్లపూసవైపోతివి. నువ్వొక్కనివే అత్తన్నవేంది పిలడా? మనుమరాలును తీసుకత్తలేవు నీ సిన్న కొడుకు పెండ్లెన్నడు?" అన్నది పరాచికంగా.

"నిన్ను తప్ప చేసుకోడటనే ఎంకటి?" ఇంకొక వయసు మళ్ళినావిడ.

నరహరి లోపల మరిచిపోయిన అనుభూతులేవో బుసబుస పొంగాయి.

వాగొడ్డు కెక్కాడు నరహరి. పడమటి సాయంత్రపు ఎండ ఊరి చింతల మీద దోబూచులాడుతోంది. పక్షులు గుంపులు గుంపులుగా చేలమీదినుంచి ఊరికేసి మళ్లుతున్నాయి. నరహరికి స్వాగతంగా ఎక్కడో ఆవు ఒర్లుతున్నది.

నరికొంచెం దూరం నడిచాడు. దారికి ఆ పక్క ఈ పక్క మైదాకు చెట్లు. పచ్చగా వున్నాయి.

మైదాకు చెట్లలో ఒంటిమీద సరీగ గుడ్డలు లేని ఒక పేద స్త్రీ ఏదో వెతుకుతోంది. ఆ స్త్రీని ఆగి చూశాడు నరహరి. ఊగులాడుతున్న ముడుతలు, పడిన చర్మం-నల్లగా బొగ్గులాంటి శరీరం- ఏ రంగు గుడ్డలో తెలియనంత దుమ్ము కొట్టుకుపోయిన బట్టలు- తెల్లగా నరిసిపోయిన వెంట్రుకలు-

"రాజెల్లి ఏం పారేసుకున్నవే" నరహరి ఆప్యాయంగా-

"ఎవలు బాచెన్" రాజెల్లి గాజు 'కళ్ళు టపటపలాడించి లేచి నిలుచున్నది. బర బర తల గోక్కున్నది- "ఓ నరారి వచేలా? కండ్లు కన్పడ్తలేవ్ బాచెన్" అన్నది.

"రాజెల్లి పైసలు గినపోయినాయే" నరహరి.

రాజెల్లి మాట్లాడలేదు. "ముసలిదాని కళ్ళు కనబడడం లేదు. ఈ పూట గాసం కోసం తెచ్చిన డబ్బేమో" నరహరి సూట్‌కేస్ కింద పెట్టి ఆ పక్క ఈ పక్క తనూ వెదికి వచ్చాడు.

నీల్ల బిందె ఎత్తుకుని వస్తున్న వడ్ల రాధమ్మ "అయ్యో తమ్మీ ఏందో ఎతుకుతున్నవ్" అన్నది నిలబడి.

"ఏం లేదక్క- గీ రాజెల్లి ఏందో పోగొట్టుకున్నదట-" నరహరి.

రాధమ్మ పొడుగ్గా నిట్టూర్చి "అది నేను గీ ఊళ్ళెకు అత్తగారింటికి అచ్చినకాన్నుంచి గల్లనే ఎతుకుతంది" రాధమ్మ వెళ్ళిపోయింది.

రాజెల్లి ఈ మాటలేవీ పట్టించుకోకుండా చెట్ల సందు దుమ్మంతా కెలుకుతోంది. మళ్ళీ లేచి వచ్చి "వచేలా సిన్న పిల్లగాని ఏడుపు ఇనత్తలేదా?" రాజెల్లి ముఖంలో నరహరికి తల్లి మనసు తడి కన్పించింది.

"లేదే" అన్నాడు నరహరి.

"అయ్యో నా కొడుకు ఎక్కెక్కి పడి ఏడుత్తండు. నా రొమ్ములు చేపులత్తన్నయ్" అన్నది.

నరహరికి రాజెల్లి పిచ్చిదని జ్ఞాపకం వచ్చింది. సూటుకేసు తీసుకుని ముందుకు సాగాడు. కొంచెం దూరం నడిచాడో లేదో ఎక్కడో చిన్న పిల్లవాడి ఏడుపు వినిపించింది.

బెదిరిపోయి అటేటు చూశాడు.

కుడివేపున గల చాకలి గుడిసెల్లో నిజంగానే పిల్లవాడు ఏడుస్తున్నాడు.

ఊరు మొదటి చింత కింద బోడగుండు పోశాలు కాళ్ళే మీద కూర్చున్నాడు. మాంసం లేని ముఖంలో ఏదో వెలుగు.

"ఇప్పుడే వత్తన్నవ కొడుకా" అన్నాడు ఆప్యాయంగా.

"ఆ" అన్నాడు నరహరి గొంతు ఎందుకో పూడుకుపోతున్నది.

పేరంలింగు మామ, లచ్చత్త, ముసలి లింగవ్వ, శావయ్య, లొడ లొడ మాట్లాడే చంద్రయ్య అందరూ అడుగుతున్నారు. ఎగుడు దిగుడు బజార్లు-బజార్లలో పాములాగా మెలికలు తిరిగిన చెట్ల వేరులు, కూలిన గోడలు, పాతబడి సగం సగం కూలిపోయిన ఇంటి కప్పు గల గుడిసెలు- జీవ కళలేని ముఖాలు- అక్కడ తప్పనిసరై మాత్రమే బతుకుతున్నట్టున్న మనుషులు-వీళ్ళందరిని తప్పించుకుని నరహరి ఇల్లు చేరుకున్నాడు.

నరహరి కన్న ముందే నరహరి రాక చేరినట్లున్నది. నరహరి తల్లి వాకిట్లోకి ఎదురొచ్చింది. ఆ తల్లి ముఖంలో కన్పించిన ఆనందం నరహరికి గుబుగుబ కన్నీళ్ళు తెచ్చింది.

"గిప్పుడేన రాకడ- పిల్లల తీసుకవస్త లేవేమిర" ఆ తల్లికి మాట రాలేదు.

సాధారణంగా ఇలాంటి సమయంలో ఒకరి మీద ఒకరు పడి గంటో అరగంటో కదుపులో దుఃఖము తీరేదాక ఏడ్చి, ఆ ఏడుపులోనే మాట్లాడుకుంటారు ఆ ఊళ్ళో వాళ్ళంతా. కాని నరహరి చదువుకున్న వాడవడంతో ఆ తల్లి అలా చేయలేదు.

నరహరి ఏమీ మాట్లాడజాలక లోపలికి వెళ్ళాడు.

రెండు పెంకుటిండ్లు, ఒక పెంకుటింట్లో నవారు మంచం మీద కూర్చున్నాడు.

నరహరి తల్లి లచ్చవ్వ పొయ్యి అంటించడం కోసం కర్రల కోసం ఇంటి వెనుకకు పోయింది.

నరహరి వచ్చాడని తెలిసి చాలామంది వచ్చి పందిరి గుంజలకు ఆతుక్కుపోయి నిలబడి యోగ క్షేమాలడిగారు.

అందరికన్నా ఆఖరుగా వచ్చాడు నరహరి తండ్రి రామయ్య. మనిషి ఎండలో కాగి కాగి మాగిన కుండైపోయాడు.

"పిల్లలు బాగున్నారా?" అన్నాడు.

లచ్చవ్వ పొయ్యి రాజేసింది.

"బాగనే వున్నరే నాయిన" అన్నాడు నరహరి. నరహరి మంచం మీదినుంచి లేచాడు. మంచంమీది నుంచి ఉత్తరాల కట్ట కిందబడ్డది.

ముసలి రామయ్య ఆ కట్ట తీసుకుని దిగుట్లో పెట్టుకున్నాడు.

"మీ నాయనకు ఆ ఉత్తరాలు తల కింద పెట్టుకోనిది నిదుర రాదుర- సదువచ్చినోడు మనింటికి రాడు పాపం- ఆ ఉత్తరాలన్నీ సదివించుకుంటడు" లచ్చవ్వ.

నరహరి అంగీ విడుస్తున్న తండ్రిని చూశాడు. ఒంటినిండా అన్నీ ఎముకలే. నరహరి మరింత కన్నీళ్ళు ఆపుకోలేక ఇంటి వెనుకకు లేచిపోయాడు.

* * *

రాత్రి పది గంటలు దాటిపోయింది. నరహరి తేరుకుని పొలాలు, పెరండ్లు, ఆవులు, ఎడ్లు అన్నీ చూసి వచ్చాడు. దాదాపుగా అందరినీ కలిసివచ్చాడు.

చలి షురువయ్యింది. పందిరి కింద భోజనం చేసి కూర్చున్నాడు. నెగడి చిటపట మండుతోంది. రామయ్య గుర్రు కొడుతున్నాడు.

"అవ్వా ముంగటి గోడ కూలిపోయింది గదనే-"

"ఇయ్యేడు వానలు బాగ కొట్టినయ్- మొగులుకే ధారవడ్డది. గ వానల్ల మాది గిండ్లల్ల కుంటిపోశాలు, కందుల మల్లయ్య గట్ల సానమంది సచ్చి పేయిండ్లు" లచ్చవ్వ.

"తొగరు లచ్చిమి మల్ల పెండ్లి జేసుకున్నదే-"

"లేదు బిడ్డా! దాని మొగడు బొగ్గుబాయిల నౌఖరి జేసి తాగుడులువాటయ్యి- అప్పులు జేసి- అప్పుల బాధ కాగలేక మీద గాంచు మూనె పోసుకుని అగ్గి బెట్టుకుని సచ్చిపేయిండు. గది నీ కెరికే కదా! మల్ల లచ్చిమికి అక్కన్నే నౌఖరి దొరికింది."

నరహరి ఇట్లా చాలా అడిగాడు.

"నిరుదు ఎండ కాలంల బిడ్డా! ఊళ్ళె ఎవలు పండలేదు. సేండ్లు సెలుకల పొన్ననే పన్నరు. దినం తప్పిచ్చి దినం ఊరుమీద బడుదు చిల్లం కల్లం జేసుడు. బిడ్డా! ఈడ బతుకు వశం గాదు"

ఆ మాటలన్నీ తను ఇంతకుముందే విన్నాడు.

"పంటల కగ్గి దల్లమా పండుతన్నయి. కని రెక్కల కష్టం తీసుకవ్చింది. "దొరా! పండుగత్తంది ఇంట్ల సొరెడిత్తులు లేవు" అని గీమాలింది. ఆడోల్లంతా "రానియ్యండ్లే దొరా" అన్నరు. "నేను అందరంత ఇరువకుంటె కయికిలియ్యకుంటనే ఎల్లగొట్టుండ్లే దొరా" అన్నది. సొదరాయినె సప్పుడు చేయ లేదు.

పెరడి పొదుగాను అడవి బందుకున్నది. అప్పట్ల పుల్లకుంట కట్టమీదికి పోవాల్నంటె ఆడోల్లు భయపడేటోల్లు- అగో .అసోటి అడివి మల్ల పెరట్లనే గొర్రెమంద బెట్టే బందుకు గొల్లోల్లు తావు మంద లేసెండ్లు-

ఏసి పోరన్ని మంచె కింద పండేసింది. ఆ పక్క ఈ పక్క మక్కబూరు పరిచింది.

ఇగ పనికంగింది.

అది మా గూడుకే ఇరుత్తంది. బండ్లు నిండుతన్నయి.

నెత్తిమీదికి పొద్దచ్చేదనుక పని జోరుగ నడిసింది. ముండకు పాలు సేపులచ్చేదాక కొడుకుమీది మతికే లేదు.

రాజెల్లి నాకింక కండ్లల్ల మెరుత్తంది. మంచె కిందికి బోయింది. అడ దాని కొడుకు లేదు. మక్కబూరంగా ఎతికింది. పెళ్ళయి- అక్కడి కిక్కడికి ఆగమాగం ఉరికింది "నా కొడుకును సూసిండ్లా నవ్వ లాలా!" అని ఏడ్చుకుంట పెరడంతా ఉరికింది.

ఆడోల్లందరము మంచె కాడి కురికి ఎతికితిమి- పిలగాడేమన్న నల్లపూస-

అంతట్లకే గొల్ల బొత్తయ్య ఆదరబాదరగా తావు మంద దగ్గరికి ఉరికచ్చిండు- మేక పిల్లలు, గొర్రె పిల్లలు గొల్లున మొత్తుకొంగ పొదిరిల్ల ఎతికి చూసుకొన్నడు.

మేం ఆడి కురికినం...

"అరరె!" బొత్తయ్య నాలికె కొరుక్కున్నడు.

"ఎంత పనైపోయిందే రాజెల్లి. మ్యాక పిల్లల కలువాటైన రొండు కుక్కలు తిరుగుతన్నయే. అయి ఎన్నడు సంపుదామన్న దెబ్బకు దొరుకుత లేవు. నేను కంచెల్ల గొర్ల మేపంగ నెత్తురుకారే మాంసము ముద్దను పట్టుకచ్చినయ్. ఆ అయిందిర- మేక పిల్లను సంపనే సంపినియని ఉరుకుత అచ్చిన" అన్నడు.

రాజెల్లి కాకిశోభం బెట్టింది. ఆ పెరట్ల పండి బొర్లింది" లచ్చవ్వ వెనుకటి సంగతి చెప్పుకొచ్చింది.

నరహరి ఎన్నో సంవత్సరాలుగా రాజెల్లిని చూస్తున్నా ఈ సంగతి తెలియనే తెలియదు.

లచ్చవ్వ నెగడి ముందు కూర్చున్నది ముసలి గువ్వలాగా.

నరహరి లేచి నిలుచున్నాడు. అతని మనసంతా తిమ్మిరెక్కినట్టుగా వున్నది.

"అవ్వా ఆ కుక్కల నేమనలేదా?" కాసేపాగి నరహరి.

"ఏమంటేమున్నది. రాజెల్లి పోయిన కొడుకు రాలే- కాసిన పిందెలన్నీ కాయలు గావు. రాజెల్లి గప్పటినుంచి పిచ్చిదైంది. దాని మొగడు మంచోడు- గీ పిచ్చిదానితోని ఏగిచ్చుకచ్చిండు. ఇయ్యేటి వానల్ల సచ్చిపేండు మునలోడు" లచ్చవ్వ. కాసేపాగి "అల్ల పెరడిడిసి పెట్టే అందరం ఉరికినం... ఊళ్ళె దెలిసి మొగోల్లు, సేండ్ల మీన్నుంచి ఉరి కచ్చిండ్లు- కుక్కల సంపిండ్లు జెగ్గమోనికైట్టె తునికి చెట్టు కింద ఉసికెల పొల్లగాని పేగులు తలకాయ దొరికినయ్" లచ్చవ్వ.

నరహరి బయటకు నడిచాడు.

"చలి బాగున్నది. రాత్రి బాగయ్యింది బిడ్డా గింత నాత్రి ఎటు బోతన్నవ్- దినాలు మంచిగ లేవు" లచ్చవ్వ మాట వినుకుంటూనే నరహరి బజార్లో నడుస్తున్నాడు.

వెన్నెల బజార్లో దాట్లు దాట్లుగా పడుతున్నది. నాలికలు వేల్లాడేసుకుని వేట కుక్కలు తనకేసే చూస్తున్నట్టుగా అనిపించింది.

నరహరికి ప్రతంగా ఆవేట కుక్కలు ఈ ఊళ్ళో ప్రతి తల్లి కొడుకును పీక్కుతిన్నట్లుగానే అనిపించింది.

నరహరి వాగు కేసే నడుస్తున్నాడు.

అట్లా కొంత దూరం నడిచేసరికి చింత మొదట్లో చలికి వణుకుతూ ఏదో ఆకారం కూర్చున్నట్లుగా అనిపించింది.

నరహరి దగ్గరిదాకా నడిచాడు.

అంత చలిలో నేలను పుసుకుతోంది ఆకారం.

"రాజెల్లి మవ్వానె" నరహరి.

"ఎవలు వచేలా? నా కండ్లు కన్పిత్తలేవు బాచెన్... సెవులు ఇన్పిత్తలేవు. వచేలా గీడ పిలగాని ఏడుపు ఇన్పిత్తందా బాచెన్..." రాజెల్లి గొంతులో అలుపు.

విచిత్రంగా నరహరికి చిన్నపిల్లవాడి ఏడుపు విన్పిస్తూనే వున్నది. అది అన్ని శబ్దాలను మించిపోయి సర్వవ్యాప్తమైపో తున్నట్లుగా-

గ్రామాల్లో పేద తల్లులంతా వేట కుక్కలు పీల్చేసిన తమ కొడుకుల కోసం యుగయుగాలుగా వెతుకుతున్నట్లనిపించింది.

వేట కుక్కల మొరుగుడు- చిన్నపిల్లవాడి ఏడుపుల మధ్య నరహరి చిక్కుకుపోయి నలుగ్గా నిల్చున్నాడు.

"వచేలా పిలగాని ఏడుపు ఇనత్తందా బాచెన్" రాజెల్లి మళ్ళీ అడిగింది.

(మీకెవరికైనా చిన్నపిల్లవాడి ఏడుపు విన్పిస్తున్నదా? పోనీ వేట కుక్కల మొరుగుడైనా విన్పిస్తున్నదా? మీ కోసం వెతుకుతున్న మీ తల్లి కన్పిస్తున్నదా?)